## నీట్‌ను రద్దు చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు

మిర్యాలగూడ, జూన్ 23: నీట్ నిర్వహణలో అవకతవకలు జరుగడంతో లక్షల మంది విద్యార్థులకు అన్యాయానికి గురయ్యారని వెంటనే ఆ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నీట్ పేపర్ లీకేజీ కావడంతో లక్షలాది మంది విద్యార్థులు నష్టపోవాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా నీట్ పేపర్ లీకేజీ కారణమైన వారిపై చర్యలు తీసుకోని పరీక్షను రద్దు చేసి తిరిగి పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు డి.గణేశ్, శ్రీనివాస్‌చారి, ప్రజా సంఘాల నాయకులు రామయ్య, డాక్టర్ ముప్పారామారావు, అంబటి నాగయ్య, పార్టీల నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, రవినాయక్ పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు దోపిడీని నియంత్రించాలి: ఎస్ఎఫ్ఐ

తిరుమలగిరి(సాగర్), జూన్ 23: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు దోపిడీని నియంత్రించాలని ఎస్ఎఫ్ఐ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీశ్, కోరె రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం వారు మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సంపాదనే ధ్యేయంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో ఫీజులను వసూలు చేస్తూ ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. అడ్మిషన్ ఫీజులు, యూనిఫాం, పుస్తకాలు, బూట్లు, టైబెల్ట్‌ల వంటి ఫీజులను ముక్కు పిండి వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రైవేట్ పాఠశాలల ఫీజలను నియంత్రించాలని లేకుంటే ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో గోపి, నవీన్, దిలీప్, రాహుల్, విష్ణు పాల్గొన్నారు.

## పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం




మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

మునుగోడు, జూన్ 23 : మునుగోడు దేవరకొండ నియోజకవర్గాల రైతులకు సాగు నీటి అందించే డిండి ఎత్తిపోతల, నక్కలగండి, ఉదయ సముద్రం ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసి మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు సాగు నీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెలికంటి సత్యం కోరారు. మండల కేంద్రంలో సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన పార్టీ నియోజకవర్గ మండల కార్యదర్శుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే మునుగోడు, దేవరకొండ నియోజకర్గంలో కొన్నివేల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురుజ రామచంద్రం గౌడ్, బొల్గూరి నర్సింహ, తీర్పారి వెంకటేశ్వర్లు, నలపరాజు రామలింగయ్య, మండల కార్యదర్శులు చాలపశ్రీను, ఈ భిక్షంరెడ్డి, భాస్కర్, బూడిద సురేశ్ పాల్గొన్నారు.

### కంఠ మహేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి తీర్మానం

గరిడేపల్లి, జూన్ 23 : మండలంలోని పొనుగోడు గ్రామంలో కంఠమహేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాలని గౌడ కులస్తులు నిర్ణయించారు. ఆదివారం గ్రామంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ఆలయ నిర్మాణానికి కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు నిధులపై చర్చించారు. సమావేశంలో గౌడ కులస్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# 7 కిలో మీటర్లు.. 70 గుంతలు

- అధ్వానంగా శాలిగౌరారం-బైరవునిబండ ప్రధాన రహదారి
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి



గుంతలు పడి నీళ్లు నిలిచిన శాలిగౌరారం-బైరవునిండ రోడ్డు

శాలిగౌరారం, జూన్ 23 : శాలిగౌరారం నుంచి బైరవునిబండ గ్రామానికి వెళ్లే 7 కిలో మీటర్ల ప్రధాన రహదారిపై దాదాపుగా 70 పైగా గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం వచ్చిన సమయంలో గుంతల్లో నీళ్లు నిలవడంతో రోడ్డా లేదా గుంత అని అర్థం కాక ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో అయితే ప్రయాణం చేయాలంటే నానా తంటాలు పడాల్సి వస్తుందన్నారు. అధికారులు పట్టించుకొని రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

## ఎం.గౌరారంలో పిచ్చి కుక్క వీరంగం.. నలుగురికి గాయాలు

నల్లగొండ సిటీ, జూన్ 23 : కనగల్ మండలం ఎం.గౌరారంలో పిచ్చి కుక్క వీరంగం చేసింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం ఇంటి ముందు ఉన్న ముగ్గురిని పిచ్చి కుక్క గాయం చేసింది. గ్రామానికి చెందిన నాగులవంచ సుజాత, గోన పుశమ్మ, బొమ్మపాల అశోక్ తో పాటు ఐదేండ్ల పాపను కరించింది. గ్రామస్తులు వెంటనే గాయ పడిన వారిని కనగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వారికి వైద్యులు చికిత్స నిర్వహించి యాంటీ రాబిస్ వ్యాక్సిన్ ఇంజెక్షన్ వేశారు. కాగా మూగ జీవాలను పలు కుక్కలను కరవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు .కుక్కలను నియంత్రించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఇద్దరు వ్యక్తులు అదృశ్యం.. పోలీసుల గాలింపు



హిల్‌కాలనీలో పెద్దబాబు చేపట్టిన నిర్మాణ స్థలంలో ఉన్న రక్తపు మరకలను పరిశీలిస్తున్న డాగ్ స్క్వాడ్ తత

నందికొండ, జూన్ 23 : నందికొండలో వ్యక్తులు అదృశ్యమైన ఘటన ఆదివారం చోటు చేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందికొండ హిల్‌కాలనీలోని మెయిన్ బజార్‌లో పర్వతనేని నాగేశ్వరరావు( అలీయాస్ పెద్దబాబు) షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు చేపడుతున్నాడు. నిర్మాణంలో హిల్ కాలనీకి చెందిన రెహ్మాన్ ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తున్నాడు. అయితే రెండ్రోజుల క్రితం రాజమండ్రి నుంచి గుర్తు తెలియని వ్యక్తి తన పేరు శివ అని నదిలో వలలు లాగడానికి వచ్చానని, తాను ఆ పని చేయలేకపోతున్నానని ఏదైనా పని ఉంటే ఇవ్వమని పెద్దబాబును కోరారు. ఇందుకు పెద్దబాబు నిరాకరించగా ఊరికి వెళ్లడానికి డబ్బులు లేవని ఏ పనైనా చేస్తానని చార్జీలకు డబ్బులు కావాలని బతిమాలడడంతో పనిలోకి పెట్టుకున్నాడు. రెండ్రోజులుగా శివ షాపింగ్ కాంప్లెక్స్‌లో పెయింట్ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి రెహ్మాన్ పెద్దబాబుకు ఫోన్ చేసి శివ పెయింటింగ్ పనులు చేస్తున్నాడని ఫోన్ చేశాడు. దాంతో పెద్దబాబు శివను ఏమి అనకు అతడి పనిని చేసుకొనివ్వు అని చెప్పి ఫోన్ పెట్టి వేశాడు. ఉదయం షాపింగ్ కాంప్లెక్స్ వచ్చేప్పటికికీ రక్తపు మరకలు పడి ఉండడం శివ, రెహ్మాన్ కనిపించకపోవడంతో పెద్దబాబు పోలీసులకు సమాచారం అందించారు.

వారు అక్కడికి చేరుకొని ఇద్దరు ఘర్షణ పడ్డారనే సంగతి తెలుసుకొని విచారణ చేపట్టారు. శివ వద్ద ఫోన్ లేకపోవడం, రెహ్మాన్ ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండడం, రెహ్మాన్ ఇంటి వద్ద లేకపోవడంతో ఇద్దరు అదృశ్యంగా ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. నల్లగొండ నుంచి డాగ్, క్యూస్ టీమ్‌లను రప్పించారు. డాగ్ స్క్వాడ్ షాపింగ్ కాంప్లెక్స్‌లో పరిశీలించి హిల్ కాలనీ మెయిన్ బజార్ చివర, మరల ప్రాజెక్ట్ హౌస్ సమీపం వరకు వెళ్లింది. పెద్దబాబు ఫిర్యాదు మేరక కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని విజయపురి టౌన్ ఎస్ఐ సంపత్ గౌడ్ తెలిపారు.

### పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి : సీఐటీయూ

మర్రిగూడ,జూన్ 23 : గ్రామపంచాయతీ కార్మికులపై ప్రభుత్వానికి కనికరం లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏర్పుల యాదయ్య విమర్శించారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 6నెలలుగా వేతనాలు ఇవ్వకుండా గ్రామాల్లో వారితో వెట్టిచాకిరీ చేయించుకుంటుందని విమర్శించారు. కార్మికుల పట్ల ప్రభుత్వం ఈ విధమైన వైఖరి కొనసాగిస్తే సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు.

### అభివృద్ధి పనులకు నిధులు మంజూరు :జడ్పీటీసీ స్వరూపారాణి

మునుగోడు, జూన్ 23 :మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు జడ్పీ నిధులు మంజూరు చేసినట్లు జడ్పీటీసీ నారబోయిన స్వరూపారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 17లక్షల రూపాయలు మంజూరు కాగా పులిపలుపులలో తాగునీటి కోసం రూ.2 లక్షలు, ఇప్పర్తి గ్రామంలో గ్రామపంచాయతీ ప్రహరి నిర్మాణానికి రూ.4 లక్షలు, మనుగోడు మండల కేంద్రంలో తాగునీటి పైపు లైన్ నిర్మాణానికి రూ.3 లక్షలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణానికి రూ.1.50 లక్షలు, ముదిరాజ్ కమ్యూనిటీ గ్రేవ్ యార్డ్ నిర్మాణంలో పెండింగ్ పను లు కోసం రూ.2 లక్షలు, చల్మెడలో అండ ర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.4.50 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు.

### నకిరేకల్ మాజీ సర్పంచ్ రవి కుమార్ మృతి

నకిరేకల్, జూన్ 23 : నకిరేకల్ పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్, హైకోర్టు అడ్వకేట్ సకినాల రవికుమార్ ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అనారోగ్యంతో మరణించారు. నకిరేకల్‌లో అడ్వకేట్‌గా ఉంటూ 2001 నుంచి 2006 వరకూ టీడీపీ నుంచి సర్పంచ్‌గా పనిచేశారు. పదవి ముగిసిన అనంతరం హైకోర్టు అడ్వకేట్‌గా హైదరబాద్‌లో స్థిరపడ్డారు. నకిరేకల్ అభివృద్ధిలో భాగస్వామిగా పట్టణంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య రవికుమార్ మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### విద్యుదాఘాతంతో ఆవు మృతి

నేరేడుచర్ల, జూన్ 23 : పట్టణంలోని ప్రధాన కూడలి వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక పాల వ్యాపారి బాబూరావుకు చెందిన ఆవును మేతకు వదిలిపెట్టాడు. మేత మేస్తూ వెళ్లి ప్రధాన కూడలిలో రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.70వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

### ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

నేరేడుచర్ల ప్రధాన కూడలిలో రక్షణలేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఈ ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ తోపుడు బండ్ల వాళ్లు, చిరు వ్యాపారులు వివిధ వస్తువులు విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎలాంటి రక్షణ గోడ లేక పోవడంతో మనుషులకు కూడా ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. రహదారి విస్తరణలో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాల్సి ఉండగా అధికారులు పట్టించుకోలేదు. కనీసం రక్షణ గోడ ఏర్పాటు చేయక పోవడం వల్లే జంతువులు ప్రమాదాల బారిన పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ వలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

### అంబేద్కర్ యూత్ కమిటీ ఎన్నిక

గరిడేపల్లి, జూన్ 23 : మండలంలోని పొనుగోడు గ్రామంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో అంబేద్కర్ యూత్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నందిపాటి నరేశ్, ఉపాధ్యక్షుడిగా చిటికెల కిరణ్, ప్రధాన కార్యదర్శిగా ఒగ్గు మహేశ్, కోశాధికారిగా లంకపల్లి రమేశ్, సభ్యులుగా ఇరుగు అనిల్, కదురు మహేశ్, చిలక మధు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.



పాఠశాల ప్రహరీకి ఆనుకొని ఉన్న కంపచెట్లు

## కేజీబీవీ చుట్టూ కంపచెట్లు

- పాఠశాలలోకి ప్రవేశిస్తున్న విషపూరిత పురుగులు
- ఆందోళనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కట్టంగూర్, జూన్ 23 : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం చుట్టూ కంపచెట్లు పెరుగడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు. గ్రామశివారులోని కల్మెర రోడ్డు సమీపంలోని చెరువువాగుకు వద్ద ఉన్న పాఠశాల చుట్టూ దట్టమైన కంపచెట్లు, పిచ్చి మొక్కలతో ప్రమాదకరంగా మారిపోయింది. పాఠశాల చుట్టూ లోతట్టు ప్రాంతం కావడంతో వర్షం నీరంత నిల్వ ఉండి విష సర్పాలకు అవాసాలుగా మారింది. వర్షా కాలంలో పాములు, విషపూరిత పురుగులు ప్రహరీ వద్ద ఉన్న చెట్ల కొమ్మల ద్వారా పాఠశాలలోనికి ప్రవేశిస్తుండడంతో విద్యార్థులు భయపడుతున్నారు. గతేడాది వంటగదిలో నాగుపాము సంచరించడంతో సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళనకు గురయ్యారని తెలిసింది. అధికారులు స్పందించి పాఠశాల చుట్టూ ఉన్న కంపచెట్లు, పిచ్చి మొక్కలను తొలిగించి శుభ్రం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణం ఎప్పుడో..!

- ఐదు నెలల క్రితమే నిధులు మంజూరు
- నిడమనూరు మండలంలో ఒక్కో మరుగుదొడ్డికి రూ.36 వేలు కేటాయింపు




ముకుందాపురం అంగన్‌వాడీ కేంద్రం

నిడమనూరు, జూన్ 23: అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. మండలంలో పక్కా భవనాలు కలిగిన అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వసతి కల్పించాలన్న ఉద్దేశంతో ఈ ఏడాది జనవరిలో రేగులగడ్డ, నారమ్మగూడెం, మార్తివారి గూడెం, ముప్పారం-1, నిడమనూరు-3, వెనిగండ్ల, వెంగన్న గూడెం, ముకుందాపురం-1 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణాల కోసం రూ.36 వేల చొప్పున నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులు మంజూరు చేసింది. నిధులు మంజూరై సుమారు ఐదు నెలలు గడుస్తున్నా ఆయా కేంద్రాల్లో నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఐదు నెలలుగా నిధులు మూలుగుతున్నా..చిన్నారులకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించేందుకు అధికారుల్లో చిత్తశుద్ధి కరువైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మరుగుదొడ్డి నిర్మాణాల ప్రారంభానికి అధికారులు తక్షణ చర్యలు చేపట్టి చిన్నారులకు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై సీడీపీఓ గంధం పద్మావతి వివరణ కోరగా 8 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణాల కోసం నిధులు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తామని వివరించారు.

## అంధుల అభివృద్ధికి సహకారం అందిస్తా

- ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు రాములు



ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కె.రాములును సన్మానిస్తున్న పొనుగోటి చొక్కారావు

నల్లగొండ రూరల్, జూన్ 23 : అంధుల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఎస్సీ కమిషన్ మాజీ జాతీయ సభ్యుడు కె.రాములు అన్నారు. ఢిల్లీలో జరుగతున్న అఖిల భారత అంధుల సంఘాల సమాఖ్య సమావేశంలో పాల్గొన్న రాములను ఏఐసీబీ జాతీయ ఉపాధ్యక్షుడు, డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పొనుగోటి చొక్కారావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా అంధ సమాజానికి సంస్థ అందిస్తున్న సేవలను అభినందించారు.

## అభినవ్ స్ఫూర్తితో యువత క్రీడల్లో రాణించాలి

- మేకల అభినవ్ జయంతిలో పలువురు నాయకులు



మేకల అభినవ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కోదాడటౌన్, జూన్ 23 : చెస్ క్రీడలో ఆసియా చాంపియన్‌గా ఎదిగి కోదాడ పేరును ఖండాంతరాలను వ్యాపింపజేసిన దివంగత మేకల అభినవ్‌ను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత క్రీడల్లో రాణించాలని టీపీసీసీ డెలిగేట్ సీహెచ్. లక్ష్మీనారాయణరెడ్డి కోరారు. ఆదివారం మేకల అభినవ్ జయంతిని కోదాడ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఉన్న అభినవ్ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెస్ క్రీడలో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదంలో అభినవ్ మృతిచెందడం మన దేశ క్రీడా రంగానికి తీరని లోటు అన్నారు. అభినవ్ తండ్రి మేకల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ నెల 26న నయానగర్ వీధిలో అభినవ్ ఆర్చిని ఎమ్మెల్యే పద్మావతి ప్రారంభించనున్నట్లు తెలిపారు. అభినవ్ పేరుతో చెస్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. దొంగరి శ్రీను అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అభినవ్ తల్లి మేకల అరుణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వర్‌రావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వంగవీటి రామారావు, మాజీ సర్పంచ్ పారా సీతయ్య, కౌన్సిలర్ చందర్‌రావు, గంధం యాదగిరి, నాయకులు బొలిశెట్టి కృష్ణయ్య, ముత్తినేని సైదేశ్వర్‌రావు, సామినేని రమేశ్, బషీర్, కొమరగిరి రంగారావు, డాక్టర్ బ్రహ్మం, ఈదుల కృష్ణయ్య, ముత్తినేని సైదేశ్వర్‌రావు, దొంగరి శ్రీను పాల్గొన్నారు.

## కల్వర్టుకు సైడ్‌వాల్ నిర్మించాలి

- సీపీఐ జిల్లా నాయకుడు ధనుంజయనాయుడు



ప్రమాదకరంగా ఉన్న కల్వర్టును పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

నేరేడుచర్ల, జూన్ 23 : నేరేడుచర్ల పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డులో పెట్రోల్ బంక్ వద్ద కల్వర్టుకు సైడ్‌వాల్ లేక పోవడంతో ప్రమాదకరంగా మారిందని, వెంటనే అధికారులు స్పందించి సైడ్‌వాల్ నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు కోరారు. ఆదివారం కల్వర్టును సీపీఐ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరేడుచర్ల నుంచి జాన్‌పహాడ్‌కు నిత్యం వందల వాహనాలు రాక పోకలు సాగిస్తుంటాయని, కల్వర్టు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అధికారులు సైడ్‌వాల్ నిర్మాణం చేపట్టాలని, అప్పటి వరకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట పార్టీ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, నాయకులు వెంకట్, లక్ష్మయ్య ఉన్నారు.

## చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి

తుంగతుర్తి, జూన్ 23 : మండలంలోని మానాపురం చెరువులో ఆదివారం చేపలు పట్టేందుకు వెళ్లిన తండాకు చెందిన లాకావత్ హరి(49) చెరువులో మునిగి మృతి చెందాడు. లాకావత్ హరి వలతో చేపలు పడుతుండగా కాళ్లకు వల చుట్టుకోగా నీటిలో మునిగి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## ఘనంగా బొడ్రాయి ఉత్సవం

గరిడేపల్లి, జూన్ 23 : మండలంలోని కాల్వపల్లి గ్రామంలో బొడ్రాయి, శీతల పరమేశ్వరీ, సీతారామచంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 1008 బిందెల నీటితో బొడ్రాయికి జలాభిషేకం, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పురోహితులు ద్రోణ సుబ్రహ్మమణేశ్వర శర్మ, రాయప్రోలు శ్రీరామయ్యశర్మ, దేవ మంగళశర్మ, దివాకరశర్మ, యో గేంద్రచార్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

- రోడ్లు, భవనాల శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి

నేరేడుచర్ల/హుజూర్‌నగర్, జూన్ 23 : హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టి, త్వరగా పూర్తి చేయాలని భారీ నీటిపారుదలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో రోడ్లు, భవనాలశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెండు నియోజకవర్గాల్లో ఈ నెల 19న రూ.126 కోట్లతో శంకుస్థాపన చేసిన పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. దాంతో పాటు మరో రూ.131 కోట్లతో చేపట్టే రోడ్ల నిర్మాణ పనులకు త్వరలో టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కోదాడ నియోజకవర్గంలోని అనంతగిరి నుంచి చనుపల్లికి రూ. 20 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం, మునగాల మండలంలోని బరాఖత్‌గూడెం నుంచి కీఆర్‌సీపురం వరకు రూ.20 కోట్లతో డబుల్ రోడ్డు, ఎన్‌హెచ్-9 నుంచి మోతే వరకు రూ.25 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం, హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మల్లారెడ్డి గూడెం నుంచి రేవూరు మీదుగా రామాపురం వరకు రూ. 20 కోట్లతో డబుల్ రోడ్డు, అమరవరం నుంచి అలింగాపురం వరకు రూ.20 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం, నేరేడుచర్ల నుంచి దూపాడు వరకు రూ.26 కోట్లతో చేపట్టే డబుల్ రోడ్డు పనులకు త్వరతగతిన టెండర్లు పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా ఏర్పాటైన పాలకవీడు, చింతలపాలెం మండలాల్లో తాసీల్దార్, మండల పరిషత్, పోలీస్ స్టేషన్ భవనాల కోసం కేటాయించిన స్థలాల్లో నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, అర్‌అండ్‌బీ సీఈలు

మోహన్‌నాయక్, రాజేశ్వర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## దండోరా రజతోత్సవాలను విజయవంతం చేయాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింత బాబు



ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బొడ్రాయిబజార్, జూన్ 23 : జూలై 7న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించే మాదిగ ఉపకులాల దండోరా రజతోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింత బాబుమాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పబ్లిక్‌క్లబ్ ఆడిటోరియంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాలకు ప్రతి జిల్లా, నియోజకవర్గ, మండలం, గ్రామ స్థాయి నాయకులు తరలిరావాలన్నారు. ఎమ్మార్పీఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు పల్లేటి లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షుడు నన్నెపంగు సైదులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరికంటి అంబేద్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనుకజానయ్య, రాష్ట్ర కార్యదర్శులు పడిదల రవికుమార్, బాణాల అబ్రహం, విజయభాస్కర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మేళ్ల చెరువు ముక్కంటి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్, కాశయ్య, సూర్యాపేట యువసేన అధ్యక్షుడు నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**PLOTS FOR SALE**

AP రాజధాని అమరావతిలో CRDA అప్రూవ్డ్ వెంచర్స్ కలవు. ORR 1/2KM కంచికచర్లకి 8KM గజం కేవలం 8499/-, పూలింగ్ ఏరియాకి ఆనుకొని గజం 25999/-, Cell:9100178179, 9849561472.

NLG-323529

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635 |
| హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638 |
| మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | చౌటుప్పల్ : 9182777638 |